మహా పత్రిక




ఓటు హక్కు వినియోగించుకున్న
ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, సతీమణి పాయం ప్రమీల



చర్ల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గా కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి శ్రీమతి పూజారి సామ్రాజ్యం గెలుపు.



**కరకగూడెం:** కరకగూడెం మండలం స్వగ్రామం సమత్ భట్టుపల్లి గ్రామంలో తన ఓటు హక్కును వినియోగించుకున్న బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పినపాక మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు

# బూర్గంపహాడ్ సర్పంచ్‌గా మంద నాగరాజు గెలుపు

**బూర్గంపహాడ్ , మహా:** బూర్గంపహాడ్ మండల కేంద్ర గ్రామపంచాయతీ సర్పంచ్ గా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మంద నాగరాజు ఘన విజయం సాధించారు. మండలంలో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ స్తానాలు సాధించింది. బూర్గంపహాడ్ ఫలితం అర్ధరాత్రి దాటాక వెలువడింది.

### చర్ల సర్పంచ్ గా పూజారి సామ్రాజ్యం

**చర్ల, మహా:** చర్ల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా పూజారి సామ్రాజ్యం ఘనవిజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థికి ప్రజలు విజయం కట్టబెట్టారు. దీంతో గురువారం అర్ధరాత్రి దాటాక చర్ల మండలకేంద్రంలో సంబురాలు మిన్నంటాయి.

# ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ ప్రభంజనం

**ఖమ్మం బ్యూరో, మహా:** ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా జరిగిన తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎప్పటిలాగే హస్తం ప్రభంజనం కనిపించింది. జిల్లాలో ఏకంగా 90 శాతానికి పైగా పోలింగ్ నమోదు కాగా, ఓటర్లు అధికారపార్టీకి వెన్నుదన్నుగా నిలిచారు. ఖమ్మం అంటేనే కాంగ్రెస్ కంచుకోట అన్న నానుడిని నిజం చేస్తూ, చర్ల వంటి మారుమూల ఏజెన్సీ ప్రాంతాల నుండి రఘునాథపాలెం వంటి రాజకీయ చైతన్యం కలిగిన మండలాల వరకు కాంగ్రెస్ పార్టీ జైత్రయాత్ర కొనసాగింది. ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ తన ఉనికిని కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతుంటే, కాంగ్రెస్ మాత్రం రికార్డు స్థాయి మెజారిటీలతో, ఏకగ్రీవాలతో సరికొత్త చరిత్రను లిఖించింది. ఖమ్మం జిల్లాలో 192 గ్రామపంచాయతీల్లో కాంగ్రెస్ 131సర్పంచ్ స్థానాలు గెలవగా, బీఆర్ఎస్ 38కే పరిమితమైంది. బీజేపీ ఖాతా తెరవలేదు. భద్రాద్రి జిల్లాలోనూ హస్త ప్రభంజనం కనిపించింది. పినపాక నియోజకవర్గంలో పాయం వెంకటేశ్వర్లు సత్తా చాటారు.

### ఏకపక్షంగా సాగిన ఎన్నికల సమరం

ఈ ఎన్నికల ఫలితాలను నిశితంగా పరిశీలిస్తే కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యం గణాంకాల్లోనూ స్పష్టంగా కనిపిస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రధానంగా ఖమ్మం, మధిర, వైరా, భద్రాచలం, పినపాక డివిజన్ల పరిధిలోని పలు మండలాల్లో ఎన్నికలు జరిగాయి. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం ఒక్క ఖమ్మం జిల్లా పరిధిలోని 7 మండలాల్లోనే (రఘునాథపాలెం, కొణిజర్ల, ఎర్రుపాలెం, మధిర, చింతకాని, వైరా, బోనకల్) మొత్తం 192 గ్రామ పంచాయతీలకు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడగా, అందులో దాదాపు 20 శాతానికి పైగా స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ఏకగ్రీవమైన స్థానాల్లో 90 శాతానికి పైగా కాంగ్రెస్ మద్దతుదారులే కైవసం చేసుకోవడం విశేషం. మిగిలిన స్థానాలకు జరిగిన పోలింగ్ లో కాంగ్రెస్ పార్టీ సుమారు 75 నుండి 80 శాతం పంచాయతీలను గెలుచుకుని క్లీన్ స్వీప్ దిశగా దూసుకెళ్లింది. ఉదాహరణకు వైరా మండలంలో 22 పంచాయతీలకు గాను 16 స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకోగా, పినపాకలో 23 పంచాయతీలకు గాను ఏకంగా 15 స్థానాల్లో కాంగ్రెస్ జయకేతనం ఎగురవేసింది. బీఆర్ఎస్ పార్టీ కేవలం అక్కడక్కడా నామమాత్రపు ఉనికిని చాటుకోగా, సీపీఎం, సీపీఐ వంటి పార్టీలు తమ కంచుకోటలైన కొన్ని గ్రామాలకు మాత్రమే పరిమితమయ్యాయి.

### చర్ల, పినపాకల్లో కాంగ్రెస్ క్లీన్ స్వీప్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతమైన చర్ల, పినపాక మండలాల్లో కాంగ్రెస్ పార్టీ అద్భుతమైన ఫలితాలను సాధించింది. ఇక్కడ బీఆర్ఎస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. చర్ల మండలంలోని మెజారిటీ పంచాయతీలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. పులిగుండాల సర్పంచ్ గా మిడియం లక్ష్మి, పెద్దిపల్లి సర్పంచ్ గా కణితి రామకృష్ణ, గొంపల్లిలో చారుశీల అశోక్, కేశవాపురంలో కాపుల శారద వంటి కాంగ్రెస్ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. అలాగే పినపాకలో కూడా కాంగ్రెస్ హవా నడిచింది. అక్కడ కాంగ్రెస్ కూటమి ధాటికి బీఆర్ఎస్, సీపీఎం కూటమిగా ఏర్పడినా కేవలం 7 స్థానాలకే పరిమితం కాక తప్పలేదు. ఏజెన్సీ ప్రాంతమైన అశ్వాపురం మేజర్ పంచాయతీలో కాంగ్రెస్ అభ్యర్థి బానోతు సదర్ లాల్ ఏకంగా 3200 ఓట్ల రికార్డు స్థాయి మెజారిటీతో గెలుపొందడం ఈ ఎన్నికలకే హైలైట్ గా నిలిచింది. బూర్గంపాడు మండలంలోనూ 18 పంచాయతీలకు గాను 5 ఏకగ్రీవం కాగా, మిగిలిన ఎన్నికల్లోనూ కాంగ్రెస్ మెజారిటీ స్థానాలను దక్కించుకుంది.

### మధిర, ఎర్రుపాలెంలలో హస్తం సునామీ

రాజకీయ చైతన్యం అధికంగా ఉండే మధిర నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించింది. మధిర, ఎర్రుపాలెం మండలాల్లోని అత్యధిక పంచాయతీలను కైవసం చేసుకోవడమే కాకుండా, కొన్ని గ్రామాల్లో వార్డులన్నీ గెలుచుకుని క్లీన్ స్వీప్ చేయడం విశేషం. మధిర మండలంలోని దేశినేనిపాలెంలో సోమా అనురాధ, వెంకటాపురంలో పరుచూరి హరినాథ్, బయ్యారంలో చిలక బత్తిని కళ్యాణ్ చక్రవర్తి వంటి అభ్యర్థులు ఘన విజయం సాధించగా, మాటూరుపేటలో కాంగ్రెస్ పార్టీ ఏకంగా 10కి 10 వార్డులను కైవసం చేసుకుని, సర్పంచ్ గా చిలువేరు పూర్ణమ్మను గెలిపించుకుని చరిత్ర సృష్టించింది. అలాగే ఖమ్మంపాడులో కూడా సర్పంచ్ బట్టా అంజన్ బాబు విజయంతో పాటు అన్ని వార్డులు కాంగ్రెస్ ఖాతాలో పడటం పార్టీ పటిష్టతకు నిదర్శనం. ఎర్రుపాలెం మండలం వెంకటాపురంలో సీనియర్ నాయకులు బొగ్గుల గోవర్ధన్ రెడ్డి 525 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు.

### ఒక్క ఓటు విజయం..
### ఉత్కంఠ పోరులోనూ పైచేయి

ఎన్నికల ఫలితాల్లో ఎర్రుపాలెం మండలం అత్యంత నాటకీయ పరిణామాలకు వేదికైంది. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు ఎంత విలువైనదో తెల్లపాలెం గ్రామ పంచాయతీ ఫలితం నిరూపించింది. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి రోజా కుమారి (మేరీ చెన్నయ్య) తన సమీప ప్రత్యర్థిపై కేవలం ఒకే ఒక్క ఓటు మెజారిటీతో గెలుపొంది, ఓటమి అంచుల నుంచి విజయతీరాలకు చేరారు. ఈ గెలుపు కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపింది. అలాగే రఘునాథపాలెం మండలంలో నువ్వా నేనా అన్నట్టు సాగిన పోరులో, బద్యాతండాలో ఒక్క ఓటు తేడాతో ఫలితం తారుమారై బీఆర్ఎస్ గెలిచినా, ఓవరాల్ గా చూస్తే మండలంలో కాంగ్రెస్ తన పట్టును నిలుపుకుంది. వి.ఆర్ బంజరలో భూక్యా రమణ 250 ఓట్ల మెజారిటీతో, చిమ్మపూడిలో కోటేరు నర్సిరెడ్డి 171 ఓట్ల మెజారిటీతో గెలిచి పార్టీ పరువు నిలబెట్టారు.

### రఘునాథపాలెం రిపోర్ట్..
### రెబల్స్ ఉన్నా రికార్డు మనదే

అత్యంత ప్రతిష్టాత్మకమైన, మంత్రి తుమ్మల ప్రాతినిధ్యం వహిస్తున్న రఘునాథపాలెం మండలంలో మొత్తం 37 పంచాయతీలకు గాను 5 ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 32 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అంతర్గత వర్గ విభేదాలు, రెబల్స్ బెడద ఉన్నప్పటికీ మెజారిటీ స్థానాల్లో విజయం సాధించింది. బీఆర్ఎస్ ఇక్కడ 10 స్థానాలు గెలుచుకున్నామని సంబరపడుతున్నా, వాస్తవానికి అక్కడ గెలిచింది కాంగ్రెస్ రెబల్స్ లేదా కాంగ్రెస్ ఓట్లు చీలిపోవడం వల్ల లభించిన విజయాలే అని విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యంగా గిరిజన తండాల్లో కాంగ్రెస్ ఏకపక్ష విజయాలను నమోదు చేసింది. చెరువుకొమ్ము తండా, హర్యా తండా, బావోజి తండా, జింకలతండా, పరికలబోడు తండా వంటి చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులు తిరుగులేని విజయాలు సాధించారు.

### కాంగ్రెస్ పాలనకు దక్కిన ప్రజా ఆమోదం

మొత్తంగా చూస్తే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ విజయ పరంపర కొనసాగుతోంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళా సంక్షేమ పథకాలు, రైతు రుణమాఫీ వంటి నిర్ణయాలు ఈ ఎన్నికల్లో స్పష్టమైన ప్రభావం చూపాయి. చర్ల వంటి ఏజెన్సీ ప్రాంతాల్లో కూడా కాంగ్రెస్ భారీ విజయాలు సాధించడం గిరిజనుల్లో ప్రభుత్వంపై ఉన్న నమ్మకాన్ని తెలియజేస్తోంది. బీఆర్ఎస్ పార్టీ గత వైభవాన్ని కోల్పోయి, ఉనికి కోసం పోరాడుతున్న పరిస్థితి స్పష్టంగా కనిపించింది. ఈ ఫలితాలు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు, భవిష్యత్ రాజకీయాలకు దిక్సూచిగా మారనున్నాయి. పల్లెల్లో ఎగిరిన కాంగ్రెస్ జెండా, ఆ పార్టీకి ప్రజల్లో ఉన్న బలమైన పునాదులను మరోసారి ప్రపంచానికి చాటిచెప్పింది.